క్లుప్తంగా

వైఎస్సార్ పెళ్లికానుక పంపిణీ



అమరావతి: మండల పరిధిలోని మల్లాది ఎస్సీ కాలనీకి చెందిన చిలకా తిరుపతిరావు కుమార్తె జ్యోతికి వివాహం నిశ్చయమైన సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పెళ్లికానుక మంజూరు చేయడం జరిగింది. మంగళవారం క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా లబ్ధిదారులు చిలకా తిరుపతిరావు, కుమార్తె జ్యోతిలకు రూ. లక్షరూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో మల్లాది మాజీ సర్పంచ్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసు, సాంబశివరావు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలకు యువతకు ఉచిత శిక్షణ

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌చే పల్నాడు జిల్లా కలెక్టర్ , డీఎస్‌డీఓ సూచనల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు వృత్తి విద్యాకోర్సులో శిక్షణ నిస్తున్నట్లు ఎంపీడీఓ పి.శివరామయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలుపుతూ కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా రెండు కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 3 వ తేదీ నుంచి 8 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు శిక్షణ తరగతులుంటాయన్నారు. 17 సంవత్సరాలు నిండిన, పదవతరగతి పాస్ ఆపైన చదువుకున్న విద్యార్థులు కోర్సుల్లో చేరేందుకు లింక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆధార్‌కార్డు, 10 పాస్‌సర్టిఫికెట్, బ్యాంక్‌పాస్ పుస్తకం, రెండు పాస్‌ఫోటోలు తీసుకుని పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని కోరారు. కోర్సుల గురించి మండలంలోని ప్రతి ఒక్క వలంటీర్ వారి పరిధిలో ఉన్న కనీసం ఇద్దరిని కోర్సుల్లో చేరేవిధంగా నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. పూర్తి సమాచారం కొరకు స్కిల్స్ హబ్ ఇన్‌చార్జి బి.మహీదర్ : 9966985773, ఇ.రామకృష్ణారెడ్డి : 8074393466 కు సంప్రదించవచ్చునన్నారు. http://r-hort ur .ac/-ksor ur లింకు ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

పేదలు, వృద్ధులు,యాచకులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని గీతామందిరం వద్ద భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో ముగ్గురు దాతల దాతృత్వంతో 60 మంది నిరుపేదలు, వృద్ధులు, యాచకులకు ఆహార (భోజన) ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఔషధ దుకాణదారుల సంఘ అధ్యక్షుడు రావిక్రింది వెంకట మల్లికార్జునరావు 35 మందికి, మహిళలు రోహిణి, వనజా, హేమలత, వరలక్ష్మి, మాధవిలు 15 మందికి, పట్టణానికి చెందిన చల్లా సురేష్ కుమార్ 10 మందికి ఆహార ప్యాకెట్లకు సహకారం అందించినట్లు నిర్వాహకుడు దివ్వెల శ్రీనివాస రావు తెలిపారు.

గోళ్ళపాడు చప్టాపై ఇసుక లారీ బోల్తా



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు వాగు పై ఉన్న చప్టా వద్ద ఇసుక లారీ బోల్తా పడిన ఘటన మంగళవారం జరిగింది. సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న ఇసుక లారీ అదుపు తప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లి పక్కకు పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సింగ్‌కు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. జరిగిన సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని ముప్పాళ్ళ పోలీసులు తెలిపారు.

ఆలయంలో వివాదంపై డీసీ విచారణ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆలయ ఈఓ వేమూరి గోపి, ఆలయ అర్చకులు, కార్యాలయ సిబ్బందికి మధ్య నెలకొన్న వివాదంపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఆలయంలో విచారణ జరిపారు. ఈఓ గోపితో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులతో విడివిడిగా మాట్లాడి వారి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో నెలకొన్న వివాదంపై విచారణ జరిపినట్టు డీసీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈఓ, అర్చకులు, సిబ్బంది ఇచ్చిన స్టేట్‌మెంట్స్‌తో నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని, వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఓ వైఖరికి నిరసనగా ఈనెల 4వ తేదీ నుంచి ఆలయంలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్టు అర్చకులు, కార్యాలయ సిబ్బంది ప్రకటించిన విషయం తెలిసిందే. తమ సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 4వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని అర్చకులు, కార్యాలయ సిబ్బంది తెలిపారు.

దేవరంపాడు ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి అంబటి రాంబాబు
- అభివృద్ధి పనులకు రూ. 1.58 కోట్లు మంజూరు
- స్నాన ఘాట్‌లకు రక్షణగోడ నిర్మాణం
- పర్యావరణ, కాటేజ్‌ల ప్రతిపాదనలు



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా బాసిల్లుతున్న నేతి వెంకన్న స్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కృషి చేస్తున్నారు. నీటి పారుదల శాఖ నుంచి రూ. 1.58 కోట్లు నిధులతో స్నాన ఘాట్‌కు రక్షణ గోడ నిర్మించేందుకు నిధులను మంజూరు చేశారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు మంగళవారం దేవరంపాడు ఆలయం వద్ద సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లా సామాజిక అటవీ అధికారి రామచంద్రరావు, జల వనరుల శాఖ డిఈ వెంకటసుబ్బయ్య దేవాదాయ శాఖ అధికారులు ఉన్నారు ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఇరిగేషన్ నిధులతో మంజూరైన పనులను పారదర్శకంగా చేయాలని సూచించారు. అలాగే సామాజిక అటవీశాఖ, దేవాదయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ కాటేజ్‌లను, కొండపై టవర్ నిర్మించేందుకు పరిశీలించిన ప్రతిపాదన సిద్ధం చేయాలని నిర్ణయించారు. కొండ కింది భాగంలో పార్కింగ్ స్థలాన్నికూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్లు వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతా శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అంబటి బ్రహ్మయ్య, పల్నా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ఈఓ శ్రీనివాసరెడ్డి, ఇఈ ఇరిగేషన్ శ్రీహరి, ఏఈ నరేష్, గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో ఆకస్మిక తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున నగర్‌లో గల నందిగం డొంకకు వెళ్లే మొదటి లో ఉన్న సాధన అనాథ వృద్ధుల ఆశ్రమంలో సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా ధికార కమిటీ ఛైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మీ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చిరు జల్లులు పడుతున్నా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విధి నిర్వహణలో వాతావరణం ఎలాగ ఉన్నా తనిఖీ నిర్వహించాలి అని న్యాయమూర్తి నాగ వెంకట లక్ష్మీ వెళ్లి అక్కడ ఉన్న వృద్ధుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వసతులు, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అవసరమైన ఉచిత న్యాయసేవలు అందిస్తాము అని తెలియజేసి వారిలో భరోసా కల్పించారు. న్యాయమూర్తితో పాటు పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ఆశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకట లక్ష్మీ

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అచ్చంపేట: స్థానిక శ్రీ షిరిడిసాయిబాబా, పర్తి సాయి, విఘ్నేశ్వర, గాయిత్రి, పంచముఖ వీరాంజనేయస్వామివార్ల దేవాలయాల 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. హనుమాన్ చాలీసా భక్తసమాజం ఆధ్వర్యంలో నూతికట్టు శంకరగుప్తా వాయిద్య బృందం వారిచే హనుమాన్‌చాలీసా పఠించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలి వచ్చారు. బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగుస్తాయని, ఈ సందర్భంగా మధ్యాహ్నం 12గంటల నుండి అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ నిర్వహకులు తిమ్మిశెట్టి రాంబాబు తెలిపారు. ఆమె వెంట ప్రముఖవైద్యులు డాక్టర్ మధుసూతనరావు సతీమణి విజయలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ రామిశెట్టి రంగయ్య, బీసీ నాయకులు సాతర్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



నంబూరు వసంతకుమారికి ఆహ్వానం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు..

మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభుగా వెలసిన సత్తెమ్మతల్లి దేవాలయంలో ఎమ్మెల్యే సతీమణి నంబూరు వసంతకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తెమ్మతల్లి దేవాలయ కమిటీ ఛైర్మన్ గుడారి గోపి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు చేరువ కావాలి

డాక్టర్ నాగమణి

నకరికల్లు: ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రజలకు చేరేవిధంగా ఆశ కార్యకర్తలు సమర్థవంతంగా పూర్తిచేయాలని డాక్టర్ బి.నాగమణి అన్నారు. ఆశాడే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశకార్యకర్తలకు మంగళవారం శిక్షణ తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా షుగర్ వ్యాధిగ్రస్తులను, రక్తపోటు సమస్య ఉన్నవారిని గుర్తించి వైద్యశిబిరం వద్దకు తీసుకువచ్చి మందులు ఇప్పించాలన్నారు. డయాలసిస్ రోగులు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకొని ఇంటివద్ద బెడ్‌రెస్ట్‌లో ఉన్న పేషంట్ల వగ్గకు డాక్టర్‌ను తీసుకెళ్లి అవసరమైన సలహాలు, సూచనలు ఇప్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనత గలవారిని గుర్తించి ఐరన్‌మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు శిబిరాల్లో పరీక్షలు చేయించాలన్నారు. కిల్‌కారి మెబైల్‌యాప్‌లో ఆశాకార్యకర్త ఫోన్ చేసి వారు చెప్పే సందేశాన్ని గర్భిణీలకు వినిపించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కె.మల్లయ్య, విజయమ్మ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం



రామకృష్ణా హిందూ హైస్కూల్ ఆవరణంలో నిలబడిన వర్షం నీరు



మొక్కజొన్నలపై కప్పిన పట్టలపై నిలిచి ఉన్న వర్షం నీరు

అమరావతి: రెండుగంటల పాటు ఎడతెరపి లేకుండా అమరావతి మండలంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4గంటలవరకు కురిసిన వర్షానికి అమరావతి మెయిన్‌రోడ్డులో డ్రైనేజీలు పొంగి మురుగు నీరుతో వర్షంనీరు కలిసి రోడ్లపై ప్రవహించడంతో గ్రామస్తులు అనేక అవస్థలు పడ్డారు. పెదమద్దూరు రోడ్డులో ఉన్న బండపేను కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం నీరు నిలిచి కాలనీ వాసుల బయటకు రావడానికి వీలులేకుండా పోయింది క్రోసూరు రోడ్డులోని పెట్రోలు బంకు సెంటరు వద్ద వాగు తూములు మూసుకుని పోవడంతో పక్కనే ఉన్నశ్రీ రామకృష్ణా హిందూహైస్కూల్ ఆవరణం వర్షం నీటితో నిండిపోయింది. భారీ వర్షానికి కళ్లాల్లో ఆరపెట్టిన మిరపకాయల పై పట్టాలు కప్పి పట్టాలపై బడిన నీటిని బయటకు పంపడానికి కాలువలు త్రవ్వడం ఎప్పటికప్పుడు పట్టాలపై నీటిని తొలగించడం వంటి పనుల్లో రైతులు అవస్థలు పడ్డారు.

అకాల వర్షంతో రైతన్నలు అవస్థలు

ముప్పాళ్ళ: అకాల వర్షం రైతన్నలను అవస్థలు పాలు చేసింది. గత రెండు రోజుల నుంచి ఒక వైపు కొద్దిసేపు ఎండ, మరో వైపు వర్షంతో రైతులు నానాపాట్లు పడాల్సి వచ్చింది. కల్లాలో ఉన్న మిరప, మొక్కజొన్న, ధాన్యం కుప్పలను కాపాడుకునేందుకు రైతులు పట్టల కోసం పరుగులు పెట్టారు. పంట దిగుబడులపై కప్పిన పట్టాలపై వర్షపునీరు నిలిచి పోయింది. కళ్లాల్లో ఉన్న ధాన్యం ఎండకపోవడంతో రంగు మారి రేటు పడిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మొక్కజొన్న రేటు తగ్గి పోవడంతో అమ్మేందుకు రైతులు నిరాకరిస్తుండడంతో పాటుగా వర్షం కురుస్తుండడంతో వాటిని నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

క్రోసూరు మండలంలో జోరుగ వానలు

క్రోసూరు: మండలంలో సోమవారం నుంచి జోరుగ వానలు కురుస్తున్నాయి. అన్ని గ్రామాల్లో ఏడతెరపి లేకుండా ఓ మోస్తరుగా జోరుగా కురుస్తున్న వర్షాలకు వేసవి తాపం నుంచి ప్రజలు సేదతీరారు. పొలాలన్నీ వర్షం నీళ్లతో నిండిపోయాయి. రైతులు పంటలు కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

ఆశా వర్కర్ల సేవలు ఎనలేనివి

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా వర్కర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ, ఫ్యామిలీ వైద్య విధానం, కిల్కారీ కాల్స్ గురించి విస్తృతంగా వివరించారు. అనంతరం చేకూరి వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రజినీకాంత్ హాస్పటల్‌కు వీల్‌చైర్‌ను బహూకరించారు. సీహెచ్ఓ పద్మావతి, ఎంపీహెచ్ఈఓ విజయరాజు, ఆగ్నేశమ్మ, సీతామహాలక్ష్మమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

26వ రేషన్ షాపులో తనిఖీలు



రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనం (ఆర్ అండ్ ఆర్ సెంటర్)లో ఉన్న 26వ రేషన్ షాపులో రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి సీఎస్‌డీటీ అరుణ, మాచర్ల సీఎస్‌డీటీ మురళీలు తనిఖీలు నిర్వహించగా రేషన్‌షాపులో రెండున్నర క్వింటాళ్ల బియ్యం, 16 కేజీల పంచదార వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సీఎస్‌డీటీ అరుణ తెలిపారు. ఈ తనిఖీల్లో వీఆర్వో తులసీ, డీలర్ తోట పిచ్చిమ్మ, వీఆర్ఏ సంజీవరావు, తదితరులు ఉన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు

పెదకూరపాడు: అకాల వర్షాలతో నష్టపోయిన మిరప రైతులకు ఎకరాకు రూ.50 వేలు, మొక్కజొన్న రైతులకు రూ.10వేలు పరిహారం అందించాలని పల్నాడు జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సమావేశంలో మాట్లాడుతూ తడిచి నాణ్యత తగ్గిన మిరపను రైతు భరోసా కేంద్రాల ద్వారా క్వింటా రూ.25వేలు, మొక్కజొన్నను క్వింటాకు రూ.2500 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

శావల్యాపురం: రీసర్వే రికార్డుల పనులు వేగవంతం చేయాలని నరసరావుపేట డివిజన్ డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ఉంగరాల భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రీసర్వే రికార్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు, పిచికలపాలెం, పోట్లూరు, శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారులు భూముల కొలతలు సరిహద్దులు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. తదుపరి సంబంధిత గ్రామాల్లోని రైతులకు ఫామ్ 9(2) నోటీసులు అందజేయటానికి రికార్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు చెప్పారు. రీసర్వే పనుల్లో రైతుల తమ వంతు సహకారం అందించాలన్నారు. పనులు పూర్తయిన గ్రామాల్లోని రైతులు తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే సమగ్ర ఆధారాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు.

ఆయుష్ వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామ సచివాలయంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు ఐదు లీటర్ల నీటిని తాగాలని, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ నివారణ, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆయుష్ మందులను పంపిణీ చేశారు.

అకాల వర్షాలతో మిరపలో జాగ్రత్తలు పాటించాలి

ముప్పాళ్ళ: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో మిరప పంట కోత అనంతరం పలు జాగ్రత్తలు తీసుకుంటే పంట రంగుమారుకుండా ఉండవచ్చని సత్తెనపల్లి డివిజన్ ఉద్యానవనశాఖాధికారి సీహెచ్‌జనని మంగళవారం తెలిపారు. మిరప పంట కోత(రెండవ, మూడవ) కల్లాల్లో అధిక తేమ వల్ల కాయలకు కుళ్ళు రావడానికి అవకాశం ఉంది కాబట్టి ముందు జాగ్రత్తగా మాంకోజెబ్(లీటరునీటికి 2.5గ్రా.) లేదా క్లోరోథలోనీల్(లీటరునీటికి 2గ్రా.) లేదా థయోఫినైట్ మిథైల్(లీటరు కి 2గ్రా.) పిచికారి చేయాలన్నారు. తెగులు ఉధృతి నివారించడానికి డైఫిన్ కొనాజోల్ 0.5 ఎం.ఎల్ లేదా ప్రోపికొనాజోల్ 1.ఎం.ఎల్ పిచికారి చేసిన తర్వాత కాబ్రియోటాప్ లీటరు నీటికి 3గ్రాములు లేదా ఆజాక్సిస్ట్రోబాన్ 1 ఎం.ఎల్ చొప్పున పిచికారి చేయాలని సూచించారు. సూక్ష్మపోషక మిశ్రమం (ఎగ్రోమిన్‌మాక్స్) లీటరుకి 2.5 గ్రాములు చొప్పున మరియు పోషకమిశ్రమం(13-0-45)లీటరు నీటికి 5గ్రాముల చొప్పున పంటపై పిచికారి చేయాలన్నారు. వర్షాలు ఆగిన తర్వాత కోత కోసి ఎండబెట్టేటప్పుడు కాయ కుళ్ళు ఆశించిన కాయలను వేరుచేసి విడివిడిగా ఎండబెట్టుకోవాలని కాబట్టి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

బీసీలంతా వైఎస్సార్ సీపీ వైపే

పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీసెల్ కన్వీనర్ శ్రీనివాసరావు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో బీసీల్లో అధికభాగం వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు తెలిపారు. మారుమూల మండలానికి చెందిన తనను పల్నాడు జిల్లా బీసీ సెల్‌కు కన్వీనర్‌గా నియమించడం చూసే సీఎం జగన్‌కు బీసీలపై ఉన్న ఆదరాభిమానాలు అర్థమవుతాయన్నారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఆయన పల్నాడు జిల్లాలోని ఎమ్మెల్యేలందరిని వారి వారి నియోజకవర్గాలకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. మాచర్ల, గురజాల, నర్సరావుపేట, వినుకొండ పెదకూరపాడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేశ్వరరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్ల బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావులతో పాటు మంత్రులు అంబటి రాంబాబు, విడుదల రజనీలను కలిపి వారి ఆశీస్సులు తీసుకున్నట్లు చెప్పారు. బీసీ వర్గానికి చెందిన మంత్రి విడుదల రజనీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి రానున్న ఎన్నికల్లో బీసీలందరికి ఏకతాటిపై తెచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట నియోజకవర్గ బీసీ నాయకులు మేకల శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, షేక్ నాగులు తదితరులున్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

సత్తెనపల్లి ఉద్యానవన శాఖ అధికారిణి సీహెచ్ జనని

సత్తెనపల్లి: ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలు చేతికి వస్తాయా లేదా అని సందేహపడుతుంటారని, అందులోనూ ప్రధాన పంట అయిన మిరప పంట కోత అనంతరం చేపట్టవల్సిన చర్యల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సత్తెనపల్లి ఉద్యానవన శాఖాధికారిణి సీహెచ్.జనని చెప్పారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం మిరప పంట కోత (రెండవ, మూడవ కోత) కల్లాల్లో ఎండు తున్న దశలో ఉందన్నారు. కల్లాల్లో ఉన్న కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయ కుళ్ళు రావడానికి అవకాశం ఉందని, కాబట్టి ముందు జాగ్రత్తగా మాంకోజెబ్ (లీటరుకి 2.5 (గ్రాములు) లేదా క్లోరోథలోనీల్ (లీటరుకి 2 గ్రాములు) లేదా థయోఫినైట్ మిథైల్ (లీటరుకి 2 గ్రాములు) పిచికారీ చేయాలన్నారు. తెగులు ఉధృతి నివారించ డానికి డైఫిన్ కొనాజోల్ 0.5 ఎంఎల్ లేదా ప్రొపికొనాజోల్ ఒక ఎంఎల్ పిచికారీ చేసిన తరువాత కాబ్రియోటాప్ లీటరుకి 3 గ్రాములు లేదా అజాక్సిస్ట్రోబాన్ ఒక ఎంఎల్ చొప్పున పిచికారి చేయాలని సూచించారు. సూక్ష్మపోష మిశ్రమం (ఎగ్రో మిన్ మాక్స్) లీటరుకి 2.5 గ్రాములు చొప్పున, స్థూల పోషక మిశ్రమము (13-0-45) లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పంటపై పిచికారీ చేయాలన్నారు. వర్షాలు ఆగిన తరువాత కోత కోసి ఎండబెట్టే టప్పుడు కాయ కుళ్ళు ఆశించిన కాయలను వేరుచేసి విడివిడిగా ఎండబెట్టుకోవాలన్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోని మిరప పంటను కాపాడుకోవాలని ఆమె తెలిపారు.

పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఈనెల 7న సాయంత్రం ఐదు గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ గుంటూరు వారి ఆధ్వర్యంలో పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో మంగళవారం పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. పుస్తక పరిచయ సభకు ప్రధానవక్తగా ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, వక్తలుగా సీనియర్ న్యాయవాదులు బత్తిన శ్రీనివాస్ బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు హాజరవుతారన్నారు. కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సామాజిక కార్యకర్తలు, న్యాయ వాదులు, ప్రముఖులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బత్తిన శ్రీనివాస బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, ప్రజా కళాకారుడు ఉన్నవ నాగే శ్వరరావు, కవి,జర్నలిస్ట్ బి.విల్సన్, జర్నలిస్ట్ బండారు సురేష్ బాబు, వెంకటేశ్వర్లు, తది తరులు ఉన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అధిక దిగుబడులు వచ్చే పంటలు సాగు చేయాలి

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తమ పొలాల్లో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. చిన్నప్ప మాట్లాడుతూ ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లి పెసర, జీలుగు, జనము 50 శాతం సబ్సిడీ ద్వారా రైతు భరోసా కేంద్రాల నుంచి ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామంలో ఉన్నటువంటి రైతు లందరూ భూసార పరీక్షలు చేయించుకుని భూమిలో ఉన్న సారాన్ని బట్టి పంటలు సాగుచేయాలని, గ్రామాల్లో భూ యజమానుల దగ్గర నుంచి భూమిని కౌలుకి తీసు కున్న రైతులు భూ యజమానులతో మాట్లాడి వారి ద్వారా అనుమతి పత్రంపై సంతకాలు చేయించుకుని క్రాఫ్ కల్టీవేషన్ రైట్ కార్డులు (సీసీఆర్సీ) తీసుకుని రైతు భరోసా రూ.13,500, ఇన్పుట్ సబ్సిడీపై రుణాలు పొందాలని, ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు ద్వారా పండించిన పంటలను మార్కెట్లో గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందని, మీరందరూ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అనుకూలమైన పంటలు వేసి అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలని రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన రంగనాథుడు

యడ్లపాడు: యడ్లపాడు మండలం సొలస గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నిత్యం సందడి నెలకొంటుంది. భూ సమేత రంగనాయక స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల రెండోరోజు కార్యక్రమాలు మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పరుచూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో ఉదయం నుంచే స్వామివారికి బిందెతీర్థం, నిత్యార్చన, విశేష హోమాలు, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నరసరావుపేటకు చెందిన ఇన్నమూరి రామబ్రహ్మయ్య భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం అర్చన, నిత్యహోమం జరగ్గా అనంతరం సర్వాంగ సుందరంగా అలంకృతుడైన రంగనాథుడు హంస వాహనంపై ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్ దంపతులు, అర్వపల్లి బ్రదర్స్, గ్రామపెద్దలు పాల్గొనగా ఆలయ ఈఓ సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.



హంసవాహనంపై కొలువుదీరిన రంగనాథుడు

పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ తనిఖీలు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక వైద్యశాలను డీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆశా వర్కర్ల పనితీరును సమీక్షించారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే వైద్యశాలను సందర్శించామన్నారు. ప్రతినెలా మొదటి మంగళవారాన్ని ఆశా డేగా నిర్వహిస్తామన్నారు.